**295 వ అధ్యాయం**

## ٢٩٥ - بَابُ النَّهْيِ عَنِ الْقَزَعِ وَهُوَ حَلْقُ بَعْضِ الرَّأْسِ دُونَ بَعْضٍ، وَإِبَاحَةِ حَلْقِهِ كُلِّهِ لِلرَّجُلِ دُونَ الْمَرْأَةِ

## 'ఖజా' చేయరాదు, ఖజా అంటే కొన్ని శిరోజాలను గొరిగించుకొని మిగతా వాటిని వదిలేయటం. పురుషుడు తల గొరిగించుకోవచ్చుగాని స్త్రీ మాత్రం గొరిగించుకోరాదు

١٦٤٠ - عَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللهُ عَنْهُمَا قَالَ: نَهَى رَسُولُ اللهِ ﷺ عَنِ الْقَزَعِ. متفقٌ عليه.

1640. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) ఖజా (అనగా కొన్ని తల వెంట్రుకలు వదిలేసి మిగతా వాటిని గొరిగించు కోవటం) చేయటాన్ని వారించారు.

(బుఖారీ-ముస్లిం)

*(బుఖారీలోని లిబాస్ ప్రకరణం - ముస్లింలోని లిబాస్ ప్రకరణం)*

١٦٤١ - وَعَنْهُ قَالَ: رَأَى رَسُولُ اللهِ ﷺ صَبِيًّا قَدْ حُلِقَ بَعْضُ شَعْرِ رَأْسِهِ وَتُرِكَ بَعْضُهُ، فَنَهَاهُمْ عَنْ ذٰلِكَ وَقَالَ: «احْلِقُوهُ كُلَّهُ، أَوِ اتْرُكُوهُ كُلَّهُ». رواه أَبو داود بإسنادٍ صحيحٍ عَلَى شَرْطِ الْبُخَارِي وَمُسْلِم.

1641. ఇబ్నె ఉమర్ (రజి) గారే చేసిన మరొక కథనం: దైవప్రవక్త (సల్లం) ఒక బాలుణ్ణి చూశారు. అతని తల వెంట్రుకల్లో కొన్నింటిని గొరిగించి మిగతా వాటిని గొరిగించకుండా వదిలే యటం జరిగింది. అది చూసి ఆయన అలా చేయవద్దని తాకీదు చేశారు. "గొరిగిస్తే పూర్తిగా గొరిగించండి. లేదంటే మొత్తం వదలిపెట్టండి" అని ఆయన పురమాయించారు. (అబూ దావూద్ ఈ హదీసును దృఢమైన ఆధా రాలతో, బుఖారీ-ముస్లిం షరతుల ననుసరించి వెలికితీశారు.)

*(సుననె అబూదావూద్‌లోని తరజ్జుల్ ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

యూదులు, క్రైస్తవులలోని కొందరు బైరాగులు, సన్యాసులు, కొందరు ఆకతాయి దుర్మార్గులు కూడా ఈ విధంగా వెంట్రుకలు గొరిగించుకునేవారనీ, వారికి భిన్నంగా ఉండటం కోసమే దైవప్రవక్త (సల్లం) దీనిని వారించారనే మాట ప్రచారంలో ఉంది. కనుక ఆ విధంగా సగం తల గొరిగించుకోవటం ధర్మసమ్మతం కాదు. ఒకవేళ ఏదయినా వ్యాధి లేక మరే ఇతర కారణం చేతనయినా అలా చేస్తే అందులో తప్పులేదు. మొత్తానికి అర్థమయ్యేదేమిటంటే గొరిగించుకుంటే పూర్తి తల గొరిగించుకోవాలి లేదా పూర్తి తలను మామూలుగానే ఉంచుకోవాలి.

١٦٤٢ ـ وَعَنْ عَبْدِاللهِ بْنِ جَعْفَرٍ رَضِيَ اللهُ عَنْهُمَا أَنَّ النَّبِيَّ ﷺ أَمْهَلَ آلَ جَعْفَرٍ رَضِيَ اللهُ عَنْهُ ثَلاثاً، ثُمَّ أَتَاهُمْ فَقَالَ: «لا تَبْكُوا عَلَى أَخِي بَعْدَ الْيَوْمِ». ثُمَّ قَالَ: «ادْعُوا لِي بَنِي أَخِي» فَجِيءَ بِنَا كَأَنَّا أَفْرُخٌ فَقَالَ: «ادْعُوا لِيَ الحَلاَّقَ» فَأَمَرَهُ، فَحَلَقَ رُؤُوسَنَا. رواهُ أَبو داود بإسنادٍ صحيحٍ عَلى شَرْطِ البُخَارِيِّ ومُسْلِمٍ.

1642. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జాఫర్ (రజి) కథనం: (మా నాన్న జాఫర్ (రజి) మరణించినప్పుడు) ఆయనింటివారు ఏడుస్తుంటే దైవప్రవక్త (సల్లం) మూడ్రోజుల వరకు వారిని ఏమీ అనకుండా వదిలేశారు. ఆ తర్వాత వారి దగ్గరకు వచ్చి, "ఈ రోజు తర్వాత నా తమ్ముడి మీద ఎవరూ ఏడ్వకూడదు" అని అన్నారు. తర్వాత "నా తమ్ముని కుమారుల్ని నా దగ్గరకు తీసుకురండి" అని ఆదేశించారు. మమ్మల్ని ఆయన దగ్గరికి తీసుకువెళ్ళటం జరిగింది. అప్పుడు మేము పసిపిల్లలం. ఆయన మంగలిని పిలవమని పురమాయించారు. ఆయన ఆదేశం మేరకు అతను మా తలలు గొరిగాడు. (అబూదావూద్ దీనిని దృఢమైన ఆధారాలతో బుఖారీ, ముస్లింల షరతులననుసరించి వెలికి తీశారు).

*(సునన్ అబూదావూద్‌లోని తరజ్జుల్ ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

జాఫర్(రజి) దైవప్రవక్త (సల్లం) గారి బాబాయి కుమారుడు. ఈయన మౌతా యుద్ధంలో అమరగతులయ్యారు. ధర్మయుద్ధంలో అమరగతినొందటం ఎంతో గొప్ప పుణ్యకార్యం. దాని

వల్ల ఆ అమర వీరునికి దైవ సన్నిధిలో ఎంతో ఉన్నతమైన గౌరవ సత్కారాలు లభిస్తాయి. అయితే ఒక వ్యక్తి మరణం వల్ల అతని ఇంటివారికి బాధ కలగటం కూడా సహజమే. అందుకే దైవప్రవక్త(స) మరణించిన వ్యక్తి యొక్క ఇంటివారికి మూడు రోజులపాటు సంతాపం పాటించేందుకు అనుమతినిచ్చారు. ఇక్కడ మూడు రోజులవరకు సంతాపం అనుమతించబడిందంటే, ఆ మూడు రోజులపాటు ఏకబిగిన ఏడుస్తూ కూర్చోవటం, పెడబొబ్బలు పెట్టటం, గుండెలు బాదుకోవటం, బట్టలు చింపుకోవటం చేయవచ్చని భావంకాదు. ఇలా చేయటం ముమ్మాటికీ నిషిద్ధం. అసలు దీని భావం ఏమిటంటే మరణించిన వ్యక్తి తాలూకు బంధుమిత్రులకు మృతుని గురించి మాట్లాడినప్పుడు సహజంగానే కళ్లవెంబడి అశ్రుధారలు ప్రవహిస్తాయి. ఎంత బలవంతంగా ఆపుకున్నప్పటికీ లోపలి నుంచి దు:ఖం తన్నుకు వస్తుంది. ఇది చాలా సహజమైన విషయం. ఇలాంటి దు:ఖం మూడు రోజుల తర్వాత వ్యక్తమయినా షరీఅత్ దాన్ని తప్పుపట్టదు. దాన్ని నిషిద్ధ విషయం(హరామ్)గా పరిగణించదు. వాస్తవానికి మనిషి భావోద్రేకాలను అదుపులో పెట్టటానికే ఈ విధమైన షరతుపెట్టబడింది. చివరగా పేర్కొనదగిన ముఖ్య విషయం ఏమిటంటే తలగొరిగించుకోవటం, ముఖ్యంగా చిన్నపిల్లల తలలు గొరిగించటం ధర్మసమ్మతమేనన్న విషయాన్ని విశదీకరించటానికి ఈ హదీసును ఈ అధ్యాయం క్రింద ప్రస్తావించటం జరిగింది.

١٦٤٣ - وَعَنْ عَلِيٍّ رَضِيَ اللهُ عَنْهُ قَالَ: نَهَى رَسُولُ اللهِ ﷺ أَنْ تَحْلِقَ الْمَرْأَةُ رَأْسَهَا. رواهُ النَّسائي.

1643. హజ్రత్ అలీ (రజి) కథనం: స్త్రీ తన తల గొరిగించుకోవటాన్ని దైవ ప్రవక్త (సల్లం) వారించారు. *(నసాయి)*

*(సుననె నసాయిలోని జీనత్ ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

ఈ హదీసు తిర్మిజీ గ్రంథంలో కూడా ఉంది. షైఖ్ అల్బానీ (రహ్మాలై) గారు దీనిని బలహీనమైన (జయీఫ్) హదీసుగా పేర్కొన్నారు. వివరాల కోసం అల్ అహాదీసుజ్జయీఫా గ్రంథం రెండవ సంపుటి 124వ పుట చూడండి. ఏమయినప్పటికీ పురుష పోలికలకు దూరంగా ఉండటం కోసం స్త్రీ తన తల గొరిగించుకోరాదనే చెప్పాలి. అయితే ఏదయినా చికిత్స నిమిత్తం లేక మరేదయినా అత్యవసర పనికోసం స్త్రీ తల గొరిగించుకోవలసివస్తే దానికి అనుమతి ఉంది.